# 27. నిప్పతో చెలగాటం

మతిపోయి బైటపడ్డాడు సారధి. అలనాడు లక్ష్మణుడు కబంధుని ఇనుప హస్తాలనుంచి బైటపడి నిట్టూర్చిన విధంగానే, సారధి కూడా నిట్టూర్చాడు.

తనకు నిజంగానే మతిపోయిందనే విషయం సెంట్రల్ స్టేషన్‌లో ఉన్న గడియారం 11-20 గంటల్ని సూచిస్తూండటం కళ్ళారా చూశాక బాగా అర్థమైంది. దాదాపు ఆరుమైళ్ళ దూరం తనకు తెలియకుండానే నడిచి వొచ్చాడంటే, మతి భ్రమించిందనే నమ్మాలి. పోతే మధ్యలో ఏ కారు కిందా పడకుండా ఇంతవరకూ రాగలిగాడంటే అది తన అదృష్టం అనుకోవాలి మరి!

శిలాప్రతిమవలె నిలబడిపోయా డతను. అలాగే నిలబడితే, చుట్టూ వున్న వాళ్ళు తనకు నిజంగా పిచ్చిపట్టిందని కూడా అనుకోవొచ్చు! ఇప్పుడు తనేం చెయ్యాలి? ఈ అర్ధరాత్రి ఇంటికి వెళ్ళేందుకు వాహనాలు దొరకవు. దొరికినా తాను అంత ఖర్చు పెట్టలేడు...అదీగాక ఇప్పుడు తను ఇంటికి వెళ్తే తన ముఖంలోని ఆందోళనను చూసి, భార్య వేసే సవాలక్ష ప్రశ్నలకు తాను జవాబు చెప్పలేక కోపగించుకోవటం, ఆ కోపంలో కొంపలో ఒక చిన్న రణరంగం రూపొందటం జరుగుతుంది. కనుక, ఇక్కడే వుండి యీ రాత్రి పొద్దుబుచ్చి, కర్తవ్యాన్ని నిర్ణయించుకోవటం అవసర మనిపించిం దతనికి.

దగ్గర్లోనే సదరన్ రైల్వే ఆఫీసున్నది. అక్కడి వాచ్‌మెన్ తనకు బాగా తెలుసు. ఈ రాత్రి అక్కడుంటే సరిపోతుంది. ఆ వూహ రాగానే సారధి సరాసరి ఆఫీసులోకి జొరబడ్డాడు.

వాచ్‌మన్ కోటయ్య గుడ్డి లాంతరు వెలుగులో చుట్ట కాల్చుకుంటున్నాడు. అడుగుల సవ్వడి అతని ప్రశాంతతను భంగపరిచింది. హఠాత్తుగా తల ఎత్తి చూశాడు....కాని ఎదురుగా వున్న వ్యక్తిని చూసేప్పటికి కోటయ్య ముఖంలోని చిరాకు, పరాకు చిత్తగించకుండానే చిరునవ్వు బైటపడింది.

చుట్ట విసిరిపారేసి లేచి నిలబడి, "నమస్కారం బాబయ్యా!.... అర్ధరాత్రి ఇలా దయచేశారు-?" అన్నాడు కోటయ్య.

"ఏం లేదు తాతా!... ఇక్కడ చిక్కడిపొయ్యాను. ఈ రాత్రికి ఇక్కడే పడుకోవాలనుకుంటున్నాను" అన్నాడు సారథి.

"దానికేం బాబయ్యా!...ఇక్కడ మీకు నిద్దర పడుతుందా?"

'నిద్ర సుఖ మెరుగదుగా?' అని తనలో తాను 'ఆకలి రుచినీ ఎరగదు - అసలిప్పుడు ఆ ఆకలే నన్ను బాధించటంలేదు!' అనుకున్నాడు.

కోటయ్య తన కంబళిమీద సారథికి పక్క అమర్చాడు. కాని, సారథి దానిమీద పడుకునేందుకు ఒప్పుకోలేదు. ఆ ముసలాడి కాస్త సౌఖ్యాన్నీ తానెందుకు అపహరించా లనుకున్నా డతను.

"నా కీ పక్క ఎందుకు తాతా!....ఏదన్నా చాప ఉంటే పడెయ్..."

కోటయ్య మారుమాట్లాడకుండా చాప ఇచ్చాడు.

సారథి నడుం వాల్చాడు. అతని శరీరం విశ్రాంతి తీసుకునేందుకు తగిన స్థితిలోనే ఉన్నప్పటికీ, మనస్సు మాత్రం ఉవ్వెత్తున లేచే సముద్ర తరంగాలను తలదన్నుతూన్నది.

కోటయ్య లోకాభిరామాయణం మొదలుపెట్టాడు. రోజు రోజుకూ పెరిగిపోతూన్న ధరలనుగూర్చీ, తన గృహ కల్లోలాలను గూర్చీ అడగకుండానే చెప్పుకుపోతూన్నాడు. తనను బాధించేలాటి సమస్యలే, ఇతరులను కూడా బాధిస్తూంటవనీ, ఎవరి సమస్యల్తోనే వారు సతమతమవుతూంటే, ఇతరుల గోడు వినే కుతూహలం ఎవరికీ ఏమాత్రం ఉండదనీ పాపం అతనికి తెలియదు...నిజానికి తన యీ ప్రస్తుత సమస్యను కోటయ్యకు చెపితే, ..తను ఆనందించగలడా? ముందసలు అతనికి అర్థమౌతుందా?

సారథి కొంచెంసేపు ఊఁ కొట్టాడు: ఆ తరువాత నిద్రను నటించాడు.. కోటయ్య తనకు శ్రోత కరువైనందుకు బహుశా నొచ్చుకుని హఠాత్తుగా మాట్లాడటం ఆపి, దుడ్డుకర్ర తీసుకొని ఆఫీసును చుట్టి వొచ్చేందుకు వెళ్ళాడు.

మలయమారుతం వీస్తున్నది. శారీరకంగా ఉదయం నుంచి ఆఫీసులో పనిచేసి సారథి అలసిపొయ్యాడు; సాయంత్రం - కాదు- గతకొన్ని గంటలనుంచీ మానసికంగా ఎంతో క్షోభపడ్డాడు. ఇప్పుడీ మందమారుతంలో హాయిగా నిద్రపట్టి వుండవలసింది.

కాని, మెదడు తెక తెక లాడుతూంటే మిగతా శరీర భాగాలు విశ్రాంతికి ఎంత గింజుకున్నా, నిద్రను దరిజేరనీదు.

-జరిగిపోయిన సంఘటనల్లో తనెక్కడన్నా తప్పటడుగు వేశానేమోనని సారధి చాలా తీవ్రంగా ఆలోచించసాగాడు; ఆ దృశ్యాలు తిరిగి కళ్ళముందు తిరగ నారభించినవి:

మిత్రుడు ప్రసాద్ బొంబాయి వెళ్తూ, ఇంట్లో మంచానపడివున్న ముసలి తండ్రినీ, భార్య పద్మనూ కాస్త కనిపెట్టి ఉండమని మరీ మరీ కోరాడు. పద్మ తనకు కొత్తేం కాదు. కాలేజీలో తనకు క్లాసుమేట్. ఒకప్పుడు పద్మలాటి భార్య తనకు లభ్యమైతే అదొక గొప్ప అదృష్టంగా తను భావించాడు. కాని, సామాన్య కుటుంబంలో పుట్టి, మధ్య తరగతి జీవితంలో చావా లేక, బతకా లేక బాధలుపడే తనకూ, బొడ్డులో బంగారంతో పుట్టి-సకలైశ్వర్యాలనూ అనుభవించే పద్మకూ పొత్తెక్కడ? ఊహలు పిచ్చివని గ్రహించేందుకు తనకు కాలవ్యయ మవలేదు. జీవితంలో తీరని కోరికల్లో అదొకటని నిశ్చయించుకుని, దాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేయగలిగినందుకు, తనను తాను అభినందించుకొన్న క్షణాలు కూడా ఉన్నవి.

ఇక ప్రసాద్‌తో తనకు ప్రాణస్నేహమే ఏర్పడింది. అతను లక్షాధికారి ఐనప్పటికీ, ఆ తారతమ్యాల నెరుగని మధుర మిత్రత్వం తా మిరువురి జీవితాలనూ పెనవేసుకొన్నది. విశేషించి పద్మ ప్రసాద్‌కు భార్యని తెలుసుకున్నప్పుడు తా నెంతో ఆనందించాడు. విధి అప్పుడప్పుడన్నా, కొంతవరకన్నా న్యాయాన్ని సమకూరుస్తుం దనుకున్నాడు. వారి అన్యోన్య దాంపత్యం చూసి సువర్ణానికి తావి అబ్బిందని తలచాడు; వారు కలకాలం సుఖ పడాలని హృదయపూర్వకంగా కోరుకున్నాడు.

కొద్దిరోజుల స్నేహంతోనే, తాను ప్రసాద్ కుటుంబంలోని వ్యక్తిగా రూపొందా డనవొచ్చు. సాయింత్రం ఆఫీసునుంచి తాను బైటికి వచ్చే వేళకు ప్రసాదే స్వయంగా కారులో ఆఫీసు బైట తనకోసం కాచుకుని ఉండటం, తనను వారింటికి తీసుకొని వెళ్ళి సకల మర్యాదలు చేయడం; తర్వాత అందరూ ఏ సినిమాకో కలిసి వెళ్ళటం, లేదా బీచ్‌కి షికారుకు వెళ్ళటం, లేదా చీట్ల పేక ఆడటం, అదీ గాకపోతే లోకాభిరామాయణంతో కాలక్షేపం చేయటం పరిపాటయింది. ఒకోనాడు రాత్రి అక్కడే భోజనం చేయటం కూడా అనేకసార్లు జరిగింది...రాత్రి యెంత పొద్దుపోయినా, ... ప్రసాదే కారులో ఇంటి దగ్గర దిగపెడుతూండేవాడు.

-ఇంత గొప్ప వ్యక్తితోటి స్నేహం తనకు ఎప్పటికన్నా ముప్పు అవుతుందేమోనని కూడా అప్పుడప్పుడు తాను ఆలోచించక పోలేదు. నిజానికి తన బతుకేదో తాను బతుకుతున్నాడు. ప్రసాద్ నుంచి తాను ఆశించిం దేమీ లేదు కాని, స్నేహమనేది

అసమానులమధ్య నైతే అపస్వరాలు పలుకుతుంటాయనే సిద్ధాంతం తనకు తెలియంది కాదు.

తన మధ్యా, ప్రసాద్ మధ్యా ఎలాటి అపార్థాలూ లేకున్నప్పటికీ, ప్రపంచం మరోవిధంగా తలచవొచ్చు. తానేదో ఆశించి ప్రసాద్‌తో స్నేహం చేస్తున్నట్లుగా ఇతరులు అనుకోవొచ్చు. ఐతే అందుకు తను భయపడ వలసిన పనిలేదు. ఇతరుల అభిప్రాయాలకు తన బాధ్యతా లేదు. ఆ మాటకొస్తే తను డబ్బుకు యెంత ఇబ్బందిపడుతున్నా, ప్రసాద్‌ను ఏనాడూ కానీ అప్పు అడగలేదు. అసలు అప్పు ప్రస్తావన లేకుండానే అతను ఇచ్చి ఉండేవాడు... ఇంతదాకా యెందుకు? ప్రసాద్ చేసే ఎగుమతి దిగుమతుల వ్యాపారంలో తనకు జీతమిచ్చి ఉద్యోగమే ఇవ్వవొచ్చు. తను అలాటిదేమీ ఆశించి ఉండలేదు. తను స్నేహాన్ని వెలకట్టి అమ్మేందుకు, రొఖ్ఖం చేసుకునేందుకు ఎప్పుడూ ప్రయత్నించనూ లేదు. పోతే, సినిమాలకూ, షికార్లకూ అయే ఖర్చు తనైతే ఎప్పుడూ పెట్టి ఉండలేదు కాని, తద్వారా తాను ఆనందించాలని కోరి ఉండనూ లేదు. ఆ సౌఖ్యాలు తనకు లేకపోయినా ఎలాటి విచారమూ తనను బాధించదు. ఈ విధంగా మిత్రత్వాన్ని ఎంత గొప్పగా, పవిత్రంగా ఉంచేందుకు ఆస్కారం ఉంటుందో అంతగానూ ఉంచగలిగాడు.

చిత్రం – ప్రసాదే ననుకుంటే అతనికన్న యెక్కువగానే పద్మ తనను ఆదరించేది. పుట్టిన దాదిగా ఒక కప్పుకిందనే పెరిగిన కుటుంబీకుల్ని మరిపించేది తమ మధ్య ఉన్న వాత్సల్యం.

అలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఒక్కనాడన్నా ఒకరివల్ల మరొకరు మనసు కష్టపెట్టుకోవలసిన సందర్భం రాలేదు. వారింట్లో తాను గడిపే కాలంలో, తాను మానసికంగానూ, శారీరకంగానూ పొందిన శ్రమను మరచిపోయి, ఎంతో తేలికైన మనస్సుతో ఇంటికి తిరిగి వొచ్చేవాడు. కాలాన్ని మరిపింప చేయగల ఆ స్నేహమే నాలుగు కాలాలపాటు పెంపొంది ఉండాలని తను మనసారా కోరుకునేవాడు.

తమ స్నేహాన్ని భంగపరిచే దుష్టశక్తులే యీ ప్రపంచంలో లేవని తాను యెన్నోసార్లు గాఢంగా నమ్మాడు; ప్రసాద్, పద్మ కూడా అదే నమ్మకంలో వున్నారనీ నమ్మాడు.

యీనాటి రాత్రి 9–30 గంటల వరకూ ఆ నమ్మకం పర్వత శిఖరంగా ఉన్నది. కాని, అంతలోనే ఒక మహాప్రళయం, భూకంపం ... ఆ పర్వతాన్ని మొదలంటా కదిలించి, కూలద్రోసి ఛిన్నాభిన్నం చేస్తుందని కలలో కూడా తలచలేదు కదా!

అలా అని కనీసం తాను అనుమానించి ఉంటే అస లా సంఘటన జరిగేందుకే వీలులేకుండా తప్పించుకొని తిరిగేవాడు కదా! ఇప్పుడంటే జారిపోయి, పగిలిపోయిన గాజుసామాను వలె తయారయ్యాక, ఖేదిస్తే మాత్ర మేమున్నది?

అసలు ఇందులో తన బాధ్యత - లేదా, తప్పు ఎంతవరకూ ఉన్నది? తాను పొరబడ్డాడా? లేక, పొరబడ లే దనుకుంటూనే కాలు జారాడా? తన ఉద్దేశాలు ఎంత పవిత్రమైనవైనా ఆశయాలు యెంత ఉన్నతమైనవి? వాటి ఫలితాలు ఏవిధంగా పరిణమిస్తవో, దాన్ని బట్టే తన వ్యక్తిత్వం నిర్ణయించ బడుతుందా?

సెంట్రల్ మీది గడియారం పన్నెండు గంటలు కొట్టి మరుసటి రోజు ఆరంభమైనదని హెచ్చరించింది.

ఆ మరురోజును గూర్చి తీవ్రంగా ఆలోచించేందుకు, ఆనాడు ఏదైనా జరగ వలసిందంటూ ఉన్నట్లయితే, దాని పునాది క్రితంరోజు మీదనే ఆధారపడి ఉంటుందనే నగ్నసత్యాన్ని సారధి గ్రహించకపోలేదు.

కనుకనే నిన్న తలక్కిందులైన తన జీవిత నౌక ఏ స్థితిలో ఉన్నదీ, తిరిగి దాన్ని యధా స్థానానికి తేగలిగే అవకాశ మున్నదీ లేనిదీ తర్కించుకోవలసిన సమయమిదనే హెచ్చరికను నిర్లక్ష్యం చేయటానికి వీలులేక పోయింది. అసలు జరిగిన సంఘటనను వివరంగా జ్ఞాపకం చేసుకోజూశాడు:

పదిరోజుల క్రితం సారధి బొంబాయి పోతూ తన ముసలి తండ్రినీ, ముద్దుల భార్యనూ కాస్త కనిపెట్టి ఉండమని కోరాడు; తను సరే నన్నాడు.

తదనుగుణంగా తాను పనిగట్టుకొని రోజూ ప్రసాద్ ఇంటికి వెళ్తూనే వున్నాడు; ముసలాయన్ను పలకరించి, ఆయన ఆరోగ్యాన్ని గూర్చి విచారించటం, కొడుకు దగ్గిర లేడని ఆయన నిరుత్సాహపడకుండా ఉండేందుగాను లోకాభిరామాయణంతో ఆయన మనసు మళ్లించటం చేస్తూనే వున్నాడు. ఆ తరువాత ఒంటరిగా రోజంతా గడపవలసి వొచ్చినందుకు విసుగెత్తి ఉంటుందని తనకు తెలుసు కనక. ఆమెతో ఎన్నో విషయాలు - తాము కాలేజిలో చదువుకునే రోజుల్లో యెవరెవరెలా ప్రవర్తించిందీ జ్ఞాపకంచేసుకుంటూ, ప్రస్తుతం సిటీలో ఆడే సినిమాలనూ, వాటి బాగోగుల్ని గూర్చి చర్చించుకుంటూ ఆమెకూ మానసికోత్సాహాన్ని సమకూర్చటం కూడా ఒక విధిగానే భావించి, నిర్వర్తిస్తూ వొస్తున్నాడు. ఈ విధంగా తనక్కూడా కొంతలో కొంతన్నా ఆఫీసు పనిలోని విసుగు కనిపించకుండా పోతోంది.

–కాని, మొన్న ఆఫీసులో అర్జంటు పనులుండటం వల్ల వెళ్ళలేక పొయ్యాడు. తీరా రాత్రి తొమ్మిదింటికి ఆఫీసునుంచి బైటికి వొచ్చాక 'ఈవేళప్పుడు ఇంకేం వెళ్తాంలే' అని సరిపెట్టుకున్నాడు. అందుకని, నిన్న, రోజూ కన్నా ఒక గంట ముందుగానే ప్రసాద్ ఇంటికి వెళ్ళాడు.

హాలులో ముసలాయన దగ్గుతూ భగవద్గీత పేజీలు తిప్పుతున్నాడు. ...వెళ్ళి ఆయనకు నమస్కరించాడు.

"రా...బాబూ!..నిన్న రాలేదేం?" అన్నాడు ముసలాయన.

"ఆఫీసుపని ఉండిపోయిందండీ."

"అమ్మాయి కూడా చాలాసేపు యెదురు చూసింది; నీవొస్తే కలసి సినిమాకు వెళ్ళాలనుకున్నట్లుంది....బహుశా ఇవ్వాళ కూడా రావేమో ననుకొని, ఇంతకుముందే సినిమాకు వెళ్ళింది-" అన్నాడు ముసలాయన.

నిన్న వొస్తే యెంత బాగుండేదో అనుకున్నాడు తను. పద్మా తను మాత్రమే సినిమాకు వెళ్తే - అదో కొత్త అనుభూతి ఐ ఉండేది. దురుద్దేశం తనలో మొలకెత్తుతూన్న అనుమానాలేమీ లేవు. కాని, కొంత సరదాగా ఉండేదేమో? నిన్న రానందుకు తనను తాను నిందించుకున్నా అంతకన్న ఇవాళ ఇంకా ముందుగానే రాలేకపోయినందుకు కించపడ్డాడుకూడాను.

తన ఆలోచనల్లో ఏమీ మాట్లాడలేకపొయ్యాడు. ముసలాయన మాత్రం తన జవాబుకు యెదురుచూస్తూనే ఉన్నాడు. చివరకు "పాపం చాలాసా ర్లనుకుంది - నీ వొస్తే బాగుండునని. పోనీ, నీ ఆఫీసుకు కారు పంపరాదా అని కూడా అన్నాను. ఎందుకనో ఊరుకుంది-" అన్నాడు.

"దానికేం లెండి...మీ ఆరోగ్యం యెలా ఉందీ?"

"మామూలే!"

ఆ తరువాత అనేక విషయాలు చర్చకు వొచ్చినవి. జీవితసారమంతా పోను, మిగిలిన పిప్పిలోనుంచి వేదాంతాన్ని తీసి ముసలాయన అందిస్తున్నాడు. అది రుచించటంలేదని పైకి చెప్పలేక తాను ఉక్కిరిబిక్కి రవుతున్నాడు. ఆయన మాత్రం అదేమీ గమనించే స్థితిలో లేడు.

నిజానికి తన మనసు పద్మ వెంటపడింది. ఆమెను చూసేందుకే ఆమె అందచందాలను చూస్తూ గుటకలు వేసేందుకే, ఆమెతో మాట్లాడుతూ తన్మయుడయేందుకే తా నిక్కడికి వొస్తున్నట్లు తోచింది. ఆమె దర్శనం కానందుకు యెంత మథనపడుతున్నాడు! ఇదివరకు పద్మపట్ల ప్రత్యేక అభిమానమంటూ ఉన్నదని తెలుసుకోలేకపొయ్యాడు; ఆమె దర్శనం కానందుకు తహ తహ లాడాడు!

ఐతే బైటికి వెళ్ళిన ఆమె తిరిగి ఎప్పటికి వొస్తుందో తెలియదు. ఈ ముసలాయన ధోరణి తనకు నచ్చటంలేదు; వెగటుగా ఉందనేందుకు సంస్కారం అడ్డొస్తోంది. పద్మకోసం మనసు ఉరకలు వేస్తున్నా, తనలో ఏదో బలహీనత ప్రవేశించి, తనను పతనమయ్యే పరిస్థితికి లాగుతుందేమోననే భయం కూడా కలుగుతోంది. అనేకసార్లు, అనేక విధాల తనను తాను మందలించుకున్నా - ఆ ఊహలు మాత్రం మరో మార్గాన్ని పట్టకుండా వున్నవి.

చివరకు ఆమె వొచ్చేదాకా ఉండి, కాస్సేపు ఆమెతో పిచ్చాపాటీ మాట్లాడి మనస్సు శాంతపరచుకొని, తనకూ నిగ్రహ మున్నదనీ, తన సంస్కారం నిజమైన సంస్కారమేననీ. తాను అంత తేలిగ్గా పతితుడయ్యే వ్యక్తి కాదనీ, తనకు తాను రుజూ చేసుకొని, విజయగర్వంతో బైటపడాలని నిశ్చయించుకున్నాడు. అలా జరిగితే తిరిగి ఇలాటి దురాలోచనలు తన మనసులో యీ జన్మకు మరి ప్రవేశించే అవకాశాలంటూ ఉండవు.

❋ ❋ ❋

క్షణమొక యుగంగా గడుపుతూ, ముసలాయన మాటలు వింటూన్నట్లే నటిస్తూ, వొళ్ళంతా కళ్ళు చేసుకొని పద్మ రాకకోసం ఎదురు చూడసాగాడు.

చివరకు తొమ్మిది గంటల ప్రాంతంలో కారు హారన్ వినబడేప్పటికి, ... ఆతృతకు ప్రతిఫలం దక్కినందుకు ఎంతో ఉత్సాహపడ్డాడు. కారు... పోర్టికోలో ఆగింది. పద్మ కారు దిగి హాలులోకి హడావిడిగా వొస్తూ. హఠాత్తుగా గమనించినట్లు తనను చూసి, నమస్కరించింది. ఆమె అందచందాలూ, వయ్యారమూ, యవ్వనశోభా కొత్తగా చూస్తున్నవాడల్లే తను నిశ్చలుడై ప్రతినమస్కారం చెయ్యటం కూడా మరిచిపొయ్యాడు.

పద్మ మాత్రం "మమ్ము మరిచిపొయ్యారు!" అని, బుంగమూతి పెట్టి చరచరా మేడపైకి వెళ్ళిపోయింది.

ముసలాయన ఇదంతా గమనించి, "నీవు రావటంలేదని కోపం వచ్చినట్లుంది. పిచ్చిపిల్ల! ఒక్కసారి పైకి వెళ్ళి ఆమెను శాంతింపజెయ్‌నాయినా!" అన్నాడు.

మొన్న రానందుకుగాను తా నెంత బాధపడుతున్నాడో, ఆమె కూడా అంత బాధనూ అనుభవిస్తూనే ఉన్నదని దాని తాత్పర్యం; అది తెలుసుకున్నప్పుడు ఎంతో హాయిని అనుభవించాడు. తన మనసు ఆ కుటుంబంలోని వారందరి మనసుల్తోనూ కలిసిపోయిం దన్నమాట!

ఉత్సాహంగానే తను మేడమీదికి వెళ్ళాడు: ఆమె డ్రాయింగ్‌రూంలో లేదు. బహుశా పక్కనే ఉన్న ప్రసాద్ రూంలో ఉండి ఉందేమోనని అటుగా వెళ్ళాడు.

గది తలుపులు తెరిచే ఉన్నవి. ద్వారంలోకి ప్రవేశించిన తను నేలకు పాతుకొని పొయ్యాడు.

గదిలోని లైట్ల కాంతి మిరుమిట్లు గొల్పుతూన్నది. ఆమె డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని ఉన్నది. జాకెట్ విప్పివేయటం వల్లా, చీరచెరగు జారి ఉండటంవల్లా, ఆమె వీపుభాగం స్ఫుటంగా కనిపిస్తోంది. శరీర ఛాయతోపాటు, యవ్వనశోభ కూడా కలిసి, లైట్లకాంతిని ఆమె వీపులో ప్రతిఫలింప జేస్తున్నది. మృదువుగా, బిగువుగా ఉన్న ఆమె చర్మం పురుషుడైన వాణ్ని చలించకుండా ఉండనీయగలదా? అద్దంముందు కాస్త పక్కకు వొత్తిగిలినప్పుడు వికసించబొయ్యే తామర మొగ్గల్లాటి రొమ్ము సౌందర్యం

తనను తాను మరిచిపొయ్యేట్లు చేయగలుగుతోంది. పద్మ ఇంత అందగత్తె అని తా నెన్నడూ తలచలేదు కదా!

తనకు తెలియకుండానే - బహుశా హద్దులు మీరే కావచ్చు - ...కొంచెం ముందుకు జరిగాడు; ఇంతవరకూ తనకు మరుగైన ఆమె ముందరి భాగం అద్దంలో ప్రతిఫలిస్తూన్నది.

చిరుచెమట్లు కమ్మిన ఆమె ముఖం మంచుబిందువు లావరించి వికసించిన పద్మం వలెనే ఉన్నది. పైన తిరిగే ఫాన్ గాలికి చెదిరి ఫాలభాగం మీద నాట్యం చేస్తున్న ఆమె ముంగురులు పద్మంలోని మధువును గ్రోలేందుకు తహతహలాడి పరుగు లెత్తుతూన్న తుమ్మెద సమూహంవలె ఉన్నది. విద్యుద్దీప కాంతిలో ఆమె కళ్ళు మెరిసిపోతూన్నవి...తాను ఎన్నాళ్ళనుంచో కలలుకన్న స్వప్నసుందరి రక్తమాంసాలతో యీ నాడు తనకు ప్రత్యక్షమైంది. ఈ సుందరి తనదైతే...!

'ఛీ...ఛీ' అనుకున్నాడు తను-తన సంస్కారం ఇంత దిగజారిపోయినందుకు, నైచ్యపు టాలోచనలకు దారితీసినందుకు తనను తాను నిందించుకున్నాడు..ఇంకా నయం! తాను చప్పున మేలుకోగలిగాడు; ఇదే విధంగా తన యీ దుష్టపు టాలోచనలు మరి కొంచెంసేపు సాగినట్లయితే, మానవుడైన తాను, దానవుడై ఏం అపచారం - దౌష్ట్యం చేయ సమకట్టేవాడో కదా! ఆ క్షణిక్రోదేకానికి బానిస గాకమునుపే తనను తాను రక్షించుకున్నాడు; నీతిని కాపాడగలిగాడు! మిత్రద్రోహిగా మారకుండా నిలవ దొక్కుకో గలిగాడు!

ఐతే, ఇంకా యీ ప్రదేశంలో నిలబడితే, తిరిగి ఆ వెధవ ఆలోచన వచ్చి తనను తాను మరిచిపొయ్యేట్లు చేస్తవేమోనని భయం వేసింది. బలహీనమైన మానవత్వాన్ని నమ్మటమెలా? అంతకన్నా ఆ పరిసరాల్లో నుంచి ప్రస్తుతానికి తొలిగిపోతే, ఆ తరువాత యీ వేడంతా చల్లారి, తాను తిరిగి మామూలు మనిషి కాగలడు కదా!

ఈ నిశ్చయంతో ఆమెను పలకరించే సాహసం కూడా లేక వెనక్కు తిరిగాడు.

"ఏమండీ! వెళ్తున్నారేం?"

మృదుమధురమైన ఆ కంఠస్వరాన్ని వినగానే అడుగు ముందుకు పడలేదు; తా నేదో దొంగతనంగా ఆమె అందాన్ని తిలకించి, పట్టుబడకుండానే దూసుకు పోతున్నందుకు కాకపోయినా, ఆ విషయాన్ని పద్మ గ్రహించి, తనను దొంగగానే పట్టుకున్నందుకు సిగ్గుపడ్డాడు.

"రండి..." అన్నదామె ఆహ్వానిస్తూ.

అప్పుడిక తను వెళ్ళిపోవటం సబబుగాదు. అందుకని తన మనస్సులో జరిగిన సంఘర్షణను పైకి కనిపించనీకుండా విశ్వప్రయత్నం చేస్తూ గదిలోకి వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు.

"అలక వహించినట్లున్నారు!" అన్నదామె.

ఒంచిన తలెత్తి చూశాడు ఆమె వొంక. రొమ్ముల మీద సన్నని పమిట తప్ప వేరే ఆచ్ఛాదనే లేదు. తాను గుటకలు వేస్తున్న సౌందర్యమంతా ప్రదర్శిత మౌతూనే ఉన్నది. మీదుమిక్కిలి ఆమె ముఖంలో ఆకలిగొన్న సింహపుచూపులు గోచరిస్తూన్నవి. ఎంతో ఉద్రేకాన్ని ఆ సన్నని మృదువైన పెదవుల మధ్య నొక్కిపెట్టేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్టు తోచింది....

ఇదంతా తన మనోభావనేనేమో? ఇందాకటినుంచీ తాను అనుభవించిన మనోవేదన తాలూకు ఛాయలే అయివుండొచ్చు!....తిరిగి తాను మలినమయ్యే ఆలోచనల్ని చేసినందుకు నొచ్చుకున్నాడు.

"ఏమండీ! మాట్లాడకూడ దనుకున్నారా?"

నిజంగానే తన నోట మాట రావటంలేదు. అత్యద్భుతాన్ని చూసి నిశ్చేతనుడయ్యే చూపరివలె మూగవోయాడు. ఆమె రూపురేఖా విలాసాన్ని చూస్తూ, అర్థంకాని స్థితిలో తికమకపడుతున్నాడు.

"మీరు రాలేదు కాని ... ఆ ఇంగ్లీషు చిత్రం ఎంత బాగున్నదో ఎంత ఉద్రిక్తపూరితంగా ఉన్నదనీ!"

ఆ చిత్రంలోని ఉద్రేకాన్నంతటీ్న తనతోపాటే మోసుకొచ్చి తన ముందు ప్రదర్శిస్తున్నదా యీమె అనిపించింది.

"మిమ్ము వెంట తీసుకెళ్ళలేదని కోపం వొచ్చిందా?" అంటూనే ఆమె వొచ్చి తన సోఫాలోనే, తనను ఆనుకొని కూలబడింది. ఆ స్పర్శని వేయి వోల్టుల కరెంటు ముట్టుకున్నట్లయి తాను కాస్త అవతలికి జరిగి కూర్చున్నాడు.

"కోపమైతే బతిమాలేదా?" అంటూనే ఆమె తనను సోఫా చివరి వరకూ తరిమి, ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నది.

"నాకేం కోపం-?" బతిమాలే వొంకతో ఆమె చేయరాని పని చేస్తుందేమోననే భయంతో, మాటలతోనే తప్పించుకునేందుకు ప్రయత్నించాడు సారథి.

ఈనాడు అంతా విచిత్రంగానే ఉన్నది. తాను చిత్రమైన ఆలోచన చేసి ఎలాగో నిలవతొక్కుకున్నాడు; ఇక పద్మకూడా చిత్రాతి చిత్రమైన తలపులతో వలపులను వొలకబోసేందుకు ప్రయత్నిస్తూంటే, తనకు చిరాకు, అసహ్యం కలుగుతోంది .... ఇంతకు ముందు ఏ దేవతలో కరుణించి పద్మని తన దాన్నిగా చేస్తే బాగుండునని ఆలోచించిన తాను, ఇప్పుడామె వొళ్ళో వాలేందుకు ప్రయత్నిస్తూంటే ఆమెనే అసహ్యించుకుంటున్నాడు. మెచ్చుకోవటాలూ, అసహ్యించుకోవటాలూ కేవలం ఆయా మనోస్థితుల మీదనే ఆధారపడి వుంటవి కాబోలు.

"ఆ చిత్రంలోనండి...నాయకీ నాయకులు...ఎలా ముద్దు పెట్టుకున్నారని...!"

ఆమె తన ముఖాన్ని పైకెత్తి ఆ ముద్దుపెట్టుకున్న విధానాన్ని తన మీద ప్రయోగించి తెలియజెప్పేందుకు ప్రయత్నించటాన్ని తాను గ్రహించక పోలేదు.

ఆ దుర్ఘటనకు అవకాశం లేకుండానే తాను లేచి నిలబడ్డాడు.

"పద్మా!" అన్నాడు, అధికార స్వరంతో. ఎదుటి వ్యక్తి తప్పును సరిదిద్దిన క్షణంలోనే తన ఆధిక్యత అధికమైంది!

ఆమె జాలిగా తన ముఖంలోకి చూసింది.

తాను కరిగిపోయి "తప్పు కాదూ?" అన్నాడు.

ఆ మెతకదనం ఆమెకు కొత్త ఉత్సాహాన్నిచ్చినట్లుంది.

"తప్పా?...తప్పులు చేయకుండానే బతకాలని చూస్తున్నారా?"

వాదనలోకి దిగింది; ఆ స్థితిలో వాదించటం యెంత నిష్ప్రయోజనమో, ఆ క్షణికోద్రేకాలు మానవుని పతనానికి కారణం కాకుండా కాపాడుకోవటం ఎంత అసంభవమో, ఆమెను చూస్తేనే అర్థమౌతోంది.

"పద్మా! నీకు మతిపోతోంది!" అని తాను హెచ్చరించాడు.

మద్యాన్ని సేవించి మత్తెక్కిన వ్యక్తివలె, బరువైన కనురెప్పలు విప్పారేందుకు ప్రయత్నిస్తూండగా తూలుతూనే "మతిపోలేదు...ఎందుకీ అవకాశాన్ని పాడుచేస్తారు?" అన్నదామె.

మీదిమీదికి వొస్తూన్న ఆమెను వారిస్తూ, "తొందరపడకు...రేపు విచారించవలసి వొస్తుంది!" అన్నాడు తను.

"రేపటి సంగతి ఇప్పుడు దేనికి రండి!-" అని చెయ్యి పట్టుకున్న దామె.

పద్మ తనను తాను సంబాళించుకోలేని స్థితిలో ఉన్నది. ఆమెకు నచ్చ చెప్పటం నిష్ప్రయోజనం. అదృష్టవశాత్తూ, అప్పుడు పద్మ ఉన్న స్థితిలాటి దానిలోనుంచి తాను యెంతగానో గుంజుకొని, ఇంతకుముందే బైటపడ్డాడు. కనుకనే తనను తాను నిలవతొక్కుకోగలిగాడు. ఇక లాభంలేదని మృదువైన ఆమె చేతిని విసిరికొట్టాడు. విసవిసలాడుతూ ఆ గదిలో నుంచి బైటపడ్డాడు.

"వెళ్తున్నారా? ... సరే వెళ్ళండి!" అని ఆమె ఘీంకరించింది. తానదేమీ గమనించలేదు. తనను చూసి ఎవరన్నా అనుమానిస్తారని సాధ్యమైనంతగా ముఖ కవళికల్ని మార్చుకుంటూ సరాసరి రోడ్డున పడ్డాడు.

❋ ❋ ❋

తాను చేసింది సబబా కాదా అనేది చిన్న పిల్లవాడు సైతం నిర్ణయించగలడు. తాను పతనం కాలేదు సరికదా, పద్మ కూడా పతిత కాకుండా రక్షించగలిగాడు. ఆమె భర్తృద్రోహి కాలేదు; తాను మిత్రద్రోహి కాలేదు. తన నైతిక జీవితానికి ఒక విషమ పరీక్ష ఎదురవగా, తాను దాన్ని ఎదుర్కొని నెగ్గు కొచ్చాడు; ఇందుకు తనను తాను అభినందించుకోవలసిందే.

ఐతే, పద్మ తనను బెదిరించినట్లుగా మాట్లాడిన చివరి మాటలు కొంత కలవరపెడుతూన్నవి. కాని, ఆ ఉద్రేకమంతా చల్లారాక తాను కూడా ఆలోచించు కోగలుగుతుంది. తప్పు జరగలేదు కనుక పశ్చాత్తాప పడలసిన అవసరం లేదు. పైగా ఆ దుర్ఘటన పాలు కాకుండా తప్పుకోగలిగినందుకు ఎంతో ఆనందిస్తుంది. రేపు తాను యెదురుపడితే, సిగ్గు పడినప్పటికీ, కాలు జారలేదు కనుక, ఆమె ఆత్మాభిమానానికి దెబ్బ తగలలేదు కనుక తిరిగి అంతా యథాప్రకారమే రోజులు సాగుతవి.

అలా కాకుండా, తన నా క్షణంలో నిరాకరించాడని, అవమానించాడనే బాధతో కుమిలిపోయి, తనపైన లేనిపోని అపనిందలు వేసి భర్తకు చెపితే? - సారంగధరుని కథ గుర్తుకొచ్చి వొణికిపొయ్యాడు సారథి. ఇందులోని నిజానిజాలు తనకూ, పద్మకూ, ఆ పరమాత్మునికే యెరుక! తన నెవ్వరూ నమ్మరు కనుక, కథ ఆ విధంగా అడ్డం తిరుగుతే మాత్రం, గెలుపు పద్మదే అవగలదు. ఒకవేళ అలా జరిగినా, తన అంతరాత్మ కలుషితం అవలేదు గనుక జీవితాంతం వరకూ తాను ప్రసాద్‌పట్ల కానీ, పద్మపట్ల కానీ అత్యాచారాన్ని జరపలేదనే తృప్తన్నా మిగులుతుంది కదా!

కాలం యెంత చిత్రమైంది! సాధువును దుర్మార్గునిగా సద్గుణుణ్ణి దుర్గుణుణ్ణిగా, మంచిని చెడుగా, అమృతాన్ని కాలకూట విషంగా మార్చుతుంది! వాటి వాటి స్వరూపాలూ, గుణగణాలూ మారుతూనే ఉంటవి; ఆ మార్పు క్షణికమే కావొచ్చు; యుగాంతాలూ కావొచ్చు.

నిజానికి పద్మ చేసిన పొరబాటు తాను చేసి ఉండవలసింది. అదృష్టవశాత్తూ తనలోని ఆ అగ్నిపర్వతం బద్ధలై పరిసరాల్ని కలుషితం చేయక మునుపే, సంబాళించుకో గలిగాడు! ఆ జ్వాలల వేడికి తాను మసైపోగాక! కాని, ఇతరులు -అందునా తన మిత్రునిపట్ల ద్రోహం, సమాజంలో అవినీతి పెంపకం మాత్రం జరగలేదు. అందుకు తా నా విధిని శ్లాఘించ వలసిందే!

పద్మ కాలు జారబోయి నందుకు తా నామెను తప్పు పట్టలేదు. ఇంత సంస్కారమున్న తాను, ఆమె క్షణికోద్రేకాన్ని తేలిగ్గా అర్థం చేసుకోగలడు! నిజానికి అలాటి అనుభూతిని కొంచెం ముందుగా తాను పొంది ఉన్నాడాయె! తన మూడ్ మారింది కనుకనే అపచారాన్ని అరికట్టగలిగాడు.

– రేపు పద్మతో యీ విషయాలన్నీ వివరించవొచ్చు. అప్పటికామె కూడా ప్రశాంతంగా ఆలోచించి, జరిగిన తప్పును గ్రహించి, జరగని అపకారానికి యెంతో సంతోషిస్తుంది. ఈ చిన్న విషయం (?) తా మిద్దరి మధ్యనే సమాధి చేయబడుతుంది కనుక, సామాజిక శాంతిభద్రతలకు ఎలాటి ప్రమాదమూ వాటిల్లదు.

ఏదెలా జరగనీ తాను రేపు మాత్రం ప్రసాద్ ఇంటికి వెళ్ళవలసిందే! అప్పటికీ పద్మ తన అభిప్రాయాన్ని మార్చుకోనట్లయితే, ఇక తన చేతుల్లో ఏమీ ఉండబోదు! మరి కొంతకాలం అటుపోకుండా ఉండటమే దానికి మందు. తాను అనుకున్నట్లే కాలమే వ్యక్తిత్వాన్ని క్రమంగా మార్చ గలుగుతుంది.

ఈ నిశ్చయాలతో, కలవరపడిన మనస్సు శాంతించింది. ఈ విషయాన్ని గూర్చి తాను మథనపడి కూడా ప్రయోజనం ఉండదు. తన తప్పు ఈషణ్మాత్రమూ లేదనేదే అంతరాత్మను పవిత్రంగా ఉంచగలుగుతుంది.

అలాటి ఆలోచనలతోనే తెల్లవారుఝామున కాస్త నిద్రపట్టింది.

## 2

మర్నాడు ఆఫీసులో పనిచేస్తున్నాడనేమాటే కాని, సారథి మనస్సు మనస్సులో లేదు. గతరాత్రి జరిగిన సంఘటనే రకరకాలుగా మనోవీధిలో తిరుగుతూ, ఇంకా కలతపెడుతూనే ఉన్నది.

ఒకవేళ పద్మ తొందరపడి ఆ ఉద్రేకంలో తాను బైటికొచ్చిన వెంటనే, తనమీద లేనిపోనివి కల్పించి నలుగురికీ చెప్పి గోల చేస్తుందేమో? అలా జరిగి ఉంటే తనను తాను కాపాడుకునేందుకు ఎలాటి అవకాశమూ ఉండదు. ఆ ఫలితాలు ఏ విధంగా ఉన్నప్పటికీ తాను భరించవలసిందే! అలా జరిగివుంటే తాను వాళ్ళింటికి వెళ్ళటం ప్రమాదకరంగా కూడా పరిణమించవొచ్చు. కనీసం తాను అవమానపడి మనోవేదనతో బైటపడలేడు.

ఒకవేళ పద్మ తనలో తానే కుమిలిపోయి, పోగొట్టుకోబోయే పవిత్రతను కాపాడుకోగలిగినందుకు ఆనందపడినట్లయితే–? తాను మారినట్లయితే, తనను నీచురాలిగా చూశాడని కూడా ఆమె తలచవొచ్చు.

అటు ముసలాయన కూడా తాను ఎందుకు రాలేదా అని తీవ్రంగా ఆలోచించనూవొచ్చు. ఎందుకు రాలేదో సవాలక్ష జవాబులు చెప్పి తప్పించుకో వొచ్చునేమో కాని, వాటిని వారు నమ్ముతారనేమిటి?

అన్నింటినీమించి అక్కడ నిజంగా ఏం జరిగిందో తెలుసుకుంటే కాని, తన కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేడు. దేవుడు మేలుచేసి, పద్మ పశ్చాత్తాప పడితే అదే పదివేలు!

కాని – యెదురు తిరుగుతే, అప్పుడు తనకూ, ప్రసాద్‌కూ మధ్య ఉన్న స్నేహం తెగతెంపు లవుతుంది. అందు క్కూడా తాను సిద్ధపడగలడు! నైతిక విలువల్ని సాధించేప్పుడు .. త్యాగం కిందనే దాన్ని జమకట్టుకోగలడు!

అంతమాత్రం చేత లోకం తనను మిత్రద్రోహిగా భావించినా, తనను తాను కించపరుచుకో నవసరం లేదు. తనకు మరోసాక్షి పద్మ ఉండనే ఉంటుంది. ఆ అపవాదు పద్మ వల్లనే తనకు ప్రాప్తించేది కనుక, ఏనాటికైనా .. దాన్ని రూపుమాపగలదు కూడాను! ఒకవేళ అలా జరగకపోయినా, జన్మంతా ఆమె తన అంతరాత్మతో పోరాడుతూ, తాను అనవసరంగా, అక్రమంగా ఒక మిత్రునిపట్ల ద్రోహాన్ని తలపెట్టి, అపచారం చేశానని బాధపడుతూ ఉంటుంది.

కాని, ఇతరులు పడే మనోవేదనల్ని గూర్చీ, ఇతరులకు తాను చేసే మేలును గూర్చే తాను ఆలోచిస్తున్నాడు కాని, తనను తాను గూర్చి ఏం ఆలోచిస్తున్నాడు? కొంతమంది తమ నేరాల తాలూకు శిక్షలు ఇతరులమీద రుద్దేందుకు ప్రయత్నించి సుఖపడుతూంటే, తాను, తనలాటివారు మాత్రం, ఇతరుల నేరాల తాలూకు శిక్షల్ని, తమ నెత్తిన వేసికొని అనుభవించేందుకు ప్రయత్నిస్తున్నారు. న్యాయా న్యాయాలనేవి నిర్ణయించబడేందుకు ఎవ్వరూ సంసిద్ధులు కావటంలేదు; అవి వాటి దారిన పోతూ అడ్డంవొచ్చినవాళ్ళను ఆహుతి చేస్తూనే ఉన్నవి. కాల ఖర్మవశాత్తు, పాంధునిమీద పిడుగుపడిన విధంగా, చెప్పకుండా, నేరంలేకున్నా, ప్రమాదంలో ఇరుక్కున్న మాదిరి–కాలసర్పం కాటు తిన్నవాళ్ళలో తా నొకడు అవుతున్నాడు!

ఇక్కడ కూర్చొని చేసే యీ ఆలోచనలకు అంతమంటూ ఎక్కడ? నిజాన్ని తెలుసుకోవాలంటే, ప్రమాదాల్ని సైతం యెదుర్కొంటూనే అన్వేషించి, పరిశో ధించవలసిందే!

కాని, అందుకు తన మనోస్థైర్యం చాలటం లేదు. ఎలా పరిణమిస్తుందోననే భయం తనకు పిరికిమందు పోస్తూనే ఉన్నది. పద్మ టెలిఫోన్‌లో తనను పిలిచి, రాత్రి జరిగిందంతా మరిచిపొమ్మని, తన మాన మర్యాదల్ని కాపాడే బాధ్యత తనదేననీ చెపితే యెంత బాగుండును! అప్పుడు తాను ఒక గొప్ప సత్కార్యాన్ని సాధించిన వీరునివలె రొమ్ములు విరుచుకుని తాను వాళ్ళింటికి వెళ్ళగలడు కదా!

ఆ ఆశతోనే సాయింత్రం దాకా గడిపాడు. కాని, తాను తలచిన విధంగా జరిగేందుకు ఇదొక మానవ జీవిత గాథ! ఈ గాథలోని పాత్రలు తన ఇష్టాయిష్టాలతో, ఒకరి ఆధీనంలో ఉండి నడిచేవి కావు. ఆయా పాత్రలు తమ తమ మనస్తత్వాలతో, క్షణక్షణానికీ మారే తత్వాలకు అనుగుణంగా నడుస్తూ, తమచుట్టూ ఉన్న వాతావరణాన్ని తారుమారు చేస్తూ. కొత్త కొత్త సమస్యల్ని సృష్టిస్తూ. నిర్మించిన శాంతి సౌధాలను

నేలమట్టం చేసి అగ్నివర్షం కురిపిస్తూ, అమృతాన్ని చిలికిస్తూ...ఇంకా తమ తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తూనే ఉంటవి!

కనుక, ఇలా జరుగుతుంది అలా జరుగుతుందనుకోవటం శుద్ధ పొరపాటు! ఎలా జరుగుతే తనకు బాగుంటుందో, తనకు అనుకూలమో- తనకు మేలు జరుగుతుందో - ఆ విధంగా ఊహించటం, కలలు కనడం జరుగుతోంది - అంతే!

ఆఫీసులోంచి బైటపడిన తరువాత కూడా చాలాసేపు అటు పద్మ ఇంటికి వెళ్ళటమా, లేక, తన ఇంటిదోవ పట్టటమా అనే ఆలోచనలతో రాత్రి తొమ్మిదింటిదాకా ఎటూ నిర్ణయించుకోలేక పొయ్యాడు. నిద్రలేమి, తాను అనుభవించిన మనోవేదన, ఆలోచనలతో తెకతెక లాడే మెదడు, అలసటతో విశ్రాంతికై తహతహలాడే శరీరావయవాలు నరాలు పొందిన బలహీనతకు నిలవతొక్కుకోలేని అసమర్థత ఇవన్నీ తెలుస్తూనే ఉన్నవి...ఇప్పుడిక వాళ్ళింటికి వెళ్ళినా బాగుండదని చివరకు తన ఇంటి వైపే నడిచాడు సారథి.

## 3

మర్నాడు -

నిన్న పెద్ద పొరపాటు చేశానని మధనపడ్డాడు తను. మానవుడు జన్మించిన దాదిగా నిన్న చేసినవన్నీ తప్పులేననే సంగతి ఇవాళ గ్రహించడం, ఇవాళ మంచి పనులు చేయాలని సంకల్పించుకోవటం, చేయలేకపోవడం లేదా - మంచి పనులేనని నమ్మి చేయటం, తిరిగి ఆ తరువాతి రోజున, గడచిన రోజు చేసినవి మంచిపనులు కా వనుకోవటం- చర్విత చర్వణంగా పరిభ్రమిస్తూనే ఉన్నది. తప్పులు చేసేందుకు కొంతకాలం, వాటిని సరిదిద్దుకొనేందుకు మిగతా కాలంగా విభజన చేసుకో గలిగినప్పటికీ, ఆ సరిదిద్దుకొనే కాలంలోనే మరికొన్ని తప్పులు జరిగిపోతూనే ఉంటవి. చివరకు జీవితంలో చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు, మరి కాలమే మిగలకుండాపోతుంది!

ఏదో ప్రమాదం జరుగుతుందేమోననే భయంతో కుమిలిపోతూ.. వేదనను అనుభవించటంకన్న, ఆ ప్రమాదం ఎంత పెద్దదైనా సరే, మిన్ను విరిగి మీదపడినా సరే - యెదుర్కోవటమే ఉత్తమమైన పద్ధతి. అందువల్ల తప్పదనుకున్న దేదో యెదురవుతుంది; తన కీ వెధవ ఆలోచనల గొడవే ఉండదు. తాను చేసిన మంచిపని ఇచ్చే ఫలితాల స్వరూపాన్ని తెలుసుకుంటే అందరికీ మంచిదే! ఇలా భయపడుతూ క్షణ క్షణమూ తనను తాను నిరాశ పరుచుకోవటంకన్న, ఒక్కసారి ఆ గాయం యెంత పెద్దదైనా సరే స్వీకరించి, దాన్ని మాన్పుకునేందుకు ప్రయత్నించటం ఉచితం.

–కనుక, ఆరునూరవనీ ఇవ్వాళ వాళ్ళింటికి వెళ్ళే తీరాలి. తాను తలిచే ప్రమాదం అల్లంత దూరంలో ఉన్నట్లయితే, తాను నిజంగా, హృదయపూర్వకంగా చేసిన సత్కార్యాన్ని పద్మకు వివరించి, అర్థమయేలా చేసి, యీ అనుమానపు మేఘాల్ని పటాపంచలు చేయగలుగుతాడు కదా! భయపడుతూండటంవల్ల పుణ్యకాలం కాస్తా గడిచిపోతే చివరకు విచార మొక్కటే తనకు శరణ్యం కాగలదు.

ఆ రోజు పగలంతా ఈ నిశ్చయమే సారథిలో బలంగా పాతుకొనీ .. వేళ్లు తన్నుకుంది. తీరా సాయింత్రం ఆఫీసునుంచి బైటపడ్డాక, ప్రసాద్ ఇంటి వైపు నడిచేందుకు కాళ్ళు తడబడ్డవి. తిరిగి ఆ నిశ్చయాన్ని కదిలించి వేసే ఆలోచనలు రాసాగినవి. వెళ్ళటం, వెళ్ళకుండటమనే వాటిని త్రాసులో వేస్తూ, అది యెటు మొగ్గుతోందో చూడలేక తికమకపడసాగాడు. ఆ త్రాసు నిలవడంలేదు. కొంతసేపు ఇటూ, మరికొంతసేపు అటూ ఊగుతూనే ఉన్నది.

ఈ విధంగా అతను రాత్రి యెనిమిదింటిదాకా బజార్లలో అర్థం లేకుండా, గమ్యస్థానం లేకుండానే తిరుగులాడాడు. ఒకచోట కూర్చొని – తాను వెళ్ళేందుకు అనువైన వైపు పడికట్టు రాళ్ళను వేయసాగాడు.... ఆ రాత్రి తాను యెంత బలవత్తరంగా పద్మను నిరాకరించడగలిగాడో, యీనాడు అంత బలహీనుడైపొయ్యాడు!

తన మనోబలమంతా, ఆ ఒక్క సంఘటనలోనూ వ్యయపరచ బడిందా?... అలా యెన్నటికీ అవదు...తాను వెళ్ళినట్లయితే నేరం చేసిన వాడు, న్యాయచట్టాల్ని అతిక్రమించిన వాడు అవుతాడు. న్యాయాధిపతి సన్నిధికి వెళ్ళేందుకు భయపడే మనస్తత్వం లాటిది తనను ఆవరించిం దనుకోవాలి! నేరస్థుడు కాని తన కీ దౌర్బల్యమేమిటి? యెంతోసేపు తనను తాను నిందించుకొని, కించపరుచుకొని, తద్వారా కొంత మనోబలాన్ని పొందుతూ, ఏమీ ఐ ఉండదు లెమ్మనే నమ్మకాన్ని నమ్ముతూన్నట్లు నటిస్తూ, యెలాగో ప్రసాద్ ఇంటి వైపు నడక సాగించాడు తను.

–కాని, సందు మలుపులో కాళ్ళకు మళ్ళీ సడన్ బ్రేక్ పడింది. ఆకలిగొన్న సివంగివున్న గుహలోనుంచి ఒకసారి యెలాగో దూసుకొని బైటపడిన తను, తిరిగి కావాలని అక్కడికే వెళ్తున్నాడా? ఒకవేళ ఆ సివంగే యీసారి తన పైకి ఉరికినట్లయితే, దాన్ని యెదుర్కొనే ఆయుధాలేమీ తన దగ్గర లేవు. కేవలం ఆ విధి మీదనే భారం వేయాలి. తనను తాను రక్షించుకోలేని స్థితిలో, ఆ సివంగే తనను భక్షించినా చేయగలిగేదేమీ లేదు!

పిశాచాలవలె వెంటాడే యీ దుష్టపు టాలోచనలు తనను పీల్చి పిప్పి జేస్తున్నవి. వీటి బాధను భరించటం కన్న, పోయి ఆ సివంగికి బలి కావటమే ఎన్నుకోదగింది. ఇతరులు మూఢులై వక్రమార్గాల పయనిస్తున్నారని తాను రాజబాటను వీడటం దేనికి? ఏదైనా అక్రమం తన తలకుచుట్టుకోనీ గాక – భరించేందుకు భయపడటం దేనికి?

వారి వారి అదృష్టాదృష్టాల్ని బట్టి మానవులకు మేలూ, కీడూ జరుగుతూండటమే లోకచరిత్ర ఐతే, తాను తన గ్రహగతుల్ని ఏనాడూ తప్పించుకోలేడు కదా!

–ఇక ఆలోచించి లాభం లేదని, సారధి చక చకా ఆ ఇంటివైపు నడవసాగాడు. తీరా గేటు దగ్గరికివెళ్ళి, క్రీనీడలో కొంచెం ఆగి, ఆ ఇంటిలో ఏం జరుగుతోందో గమనిద్దామని ప్రయత్నించాడు. బైటికి మాత్రం అంతా ప్రశాంతంగానే అనిపించింది. అంతా యెప్పటివలెనే ఉన్నది. అలా యెంత సేపు నిలబడినా తనకేం తెలియదని, వొణికే కాళ్ళను బలవంతాన స్వాధీనం లోకి తెచ్చుకుంటూ, ఆ వెళ్ళేది తాను కాదనే ధోరణిలో చకచకా లోనికి నడిచాడు.

యధాప్రకారంగానే ముందుగా ముసలాయన దర్శనం ఐంది. ఆయన ముఖంలో యెక్కడా కలవరపాటు కానరానందుకు సారధికి కొంచెం స్థిమితపడ్డాడు.

మామూలుగానే "ఏం నాయనా! నిన్న రానేలేదు?" అన్నాడాయన.

ఆ కంఠస్వరంలో యెలాటి అనుమానమూ లేదు; విధి తనను అదృశ్యరూపంలో కాపాడుతూనే ఉన్నందుకు సారధికి యెక్కడలేని సంతోషమూ కలిగింది.

"ఆఫీసులో పని యెక్కువగా ఉండి..." అన్నాడు తను.

మూడ్ దానంతటదే మారుతున్న సంగతి గ్రహించ గలుగుతున్నాడు. ప్రమాదమని భ్రమించింది ప్రమాదం కానప్పుడు, ఒక జీవన్మరణ సమస్య అనుకూలంగా సమకూరినపుడు మనస్సుపొందే ఆనందం ఆవరించింది.

"నిన్నా, ఇవ్వాళా కోడలు కిందికే రాలేదు నాయనా! ఆరోగ్యం సరిగ్గా వుందో లేదో కూడా తెలియదు. దిగులు పడిపోయినట్లుంది–"

దేవుడు మేలుచేసి ఆమె పశ్చాత్తాపపడి ఉండొచ్చు. అప్పుడు తన పని తేలికవుతుంది. మొదట్లో తనను చూసి సిగ్గుతో కుంగిపోయినా, నదీ ప్రవాహంలో పడి కొట్టుకొనిపొయ్యేవాళ్లు, ఒకరి కొకరు ఆధారంగా వొడ్డు జేరి, విధి తమను కరుణించిం దనుకొన్న విధంగా ఇదంతా పరిణమించుతుందని అనుకున్నాడు తను.

"పోయి–దాన్ని కాస్త పలకరించు బాబూ!"

సారధి లేచి నిలబడి మేడ మీదికి ఒకసారి చూశాడు. పద్మ గదిలో లైటు వెలుగుతూనే ఉంది..బహుశా ఆనాటిరాత్రి జరిగిన సంఘటనతో సిగ్గుపడి విశ్రాంతి తీసుకుంటోందేమో! తనకు కావలసిందీ – అదే!

కొత్త ఉత్సాహంతో సారధి మేడమెట్లు యెక్కాడు. పద్మ గదిలోకి విసురుగానే వొచ్చాడు. లోపల మాట లేవో వినిపిస్తూండటం వల్ల హఠాత్తుగా ఆగిపొయ్యాడు.

ఎవరో మాట్లాడుకుంటూంటే, చాటుగా ఉండి వినే తత్వం కా దతనిది. ఐతే యీ సమయంలో, ఎవరేం మాట్లాడినా పాము చెవులతో విని అర్థం చేసుకోనిదే ముందడుగు వేసేందుకు వీల్లేదు. అందుకని పొంచివుండి వినసాగాడు.

"...ఏదో పొరపాటు జరిగింది. దాన్ని గూర్చి తరచటం అనవసరం అనుకో. అని-" ఆ కంఠస్వరం పద్మది. దీనంగా, జాలిగా ధ్వనిస్తోంది. తన సంగతే చెపుతూ, సానుభూతితో మాట్లాడుతోందేమో ననుకున్నాడు- సారథి. ఐతే, ఆమె మాట్లాడే దెవరితో? ప్రసాద్ బొంబాయి నుంచి తిరిగి రాలేదని తనకు తెలుసు. మరైతే యెవరితో?

"పొరపాటా?" అన్నదో పురుషకంఠం; అధికారం, క్రూరత్వం ధ్వనిస్తున్నాయ్. "అలాగే అనుకో. దానికేమొచ్చె?...నాకు మాత్రం తెల్లారేప్పటికి ఐదొందలు కావాలి. తెలిసిందా?"

ఆ కంఠస్వరం యెవరిదో సారథి గుర్తించ గలిగాడు! కారు డ్రైవర్ రహీంది. వీడి స్వరంలో ఇంత అధికారమా? ఒకవేళ పద్మ జరిగిన సంఘటనను లోలోన దాచుకోలేక, వీడికి చెప్పిందేమో? అది విని ఆమెను బెదిరిస్తున్నాడేమో? ఒక సేవకుడికి ఇంత సాహసమా? మొహంమీద ఉమ్మేసి యెందుకు బైటికి గెంటించదు యీామె అనిపించింది.

"రహీం! నేను అస్వతంత్రురాలిని ... డబ్బు ఎక్కణ్నుంచి తేగలను? నిన్ననే వెయ్యి రూపాయి లిచ్చాను కదా!" ప్రాధేయపూర్వకంగా మాట్లాడుతోందామె - యజమానురాలు!

"నిన్నటిది- నిన్నటితోనే సరి! మీ మీ విలాసాలకు నా బోటివాడిని బానిసగా చేసుకోలేదా?"

"రహీం! నిజం చెపుతున్నాను- నేను అలాటి దాన్ని కాదు!"

రహీం వికటాట్టహాసంతో గదిలోని గోడలు ప్రతిధ్వనించినవి.

"నీ వెలాటి దానివో నాకు తెలుసు! నా నోటివెంట చెప్పించటం సరదాగా ఉన్నదా?- అదంతా ఎందుకు? రేపు పొద్దున వొస్తాను-"

బరువైన బూట్ల చప్పుడు ద్వారం వైపే వొస్తోంది; సారథి కనిపించకుండా క్రీనీడలో నక్కాడు. ఈ ఆస్తిపాస్తు లన్నిటికీ, తానే అధికారి నన్నంత ధీమాగా, రహీం నడచి వెళ్ళాడు.

సారథికి ఇప్పు డిప్పుడే జరిగిందంతా అర్థమౌతోంది. పద్మను ఏకవచన ప్రయోగంతో సంబోధించాడంటే, ఆ సాహసాన్ని ఆమే ఇచ్చి ఉండాలి!... అంటే... పద్మను తాను నిరాకరిస్తే..ఆమె వీడిపాల బడిందా? ఇంత నీచానికి వొడి కట్టిందా? ... కావొచ్చు... అందుకనే వాడు యీామె నొక ఆట వస్తువుగా పరిగణిస్తున్నాడు. తన ఇష్టాయిష్టాలకు ఆమెను బానిసగా చేయాలని ప్రయత్నిస్తున్నాడు!

ఇంత దారుణం జరుగుతుం దనుకోలేదు -తను! ఐనా యీామెకు ఎందుకు బుద్ధిలేకుండా పోయింది? అగ్నిగుండంలో పడకుండా తా నామెను కాపాడుతే పక్కనే ఉన్న సుడిగుండంలోకి ఎందుకు పరిగెత్తిందీమె?

పద్మమీది కోపంతో దేహమంతా దహించుకొని పోతున్నట్లుంది. ఈమె నిజంగా నిప్పే! ఆ నిప్పుకు పురుషుడైన తాను ఇంధనం కాకుండా తప్పించుకో గలిగాడు. కాని, అంత మాత్రంచేత ఆమె తనను తాను రక్షించుకోలేక పోయింది. ఆ నిప్పు ఆమెనే దహించి వేస్తుందని తాను తలచలేదు కదా!

కోపంతోనే సారథి పద్మ గదిలోకి దూసుకుపొయ్యాడు. పద్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూన్నదల్లా అడగుల సవ్వడికి తల పైకెత్తి చూసింది. ఈ రెండు రోజుల్లోనే ఆమె ఎంత మనోవ్యధను అనుభవించి ఉంటుందో, ఎంత నీరసించి–జాలి గొలిపేట్లున్నదో చూడగానే సారథి కరిగిపొయ్యాడు. గొంతు వరకూ వొచ్చిన కోపజ్వాలలు, జాలి ప్రవాహాలైనవి. 'పాపం!' అనిపించిందతనికి.

–కాని, పద్మ మాత్రం సారథిని చూడగానే సిగ్గుపడ లేదు – సరికదా, అసహ్యం ఉట్టిపడేట్లు, చిరాకు చూపులు విసిరింది. అంతలోనే పమిట కొంగుతో ముఖమంతా తుడుచుకొని. మూడ్‌ను మార్చుకునేందుకు నానా అవస్థా పడుతోంది. బహుశా తన కేమీ తెలియదని ఆమె పొరబడుతోందేమో ననిపించింది.

"పద్మా! ఇంత నీచానికి వొడిగడతా వనుకోలేదు!" అన్నాడు. ఏదో అధికారం కంఠస్వరంలో దానంతటదే పలికింది.

'అంతా తెలిసి పోయిందా?' అన్నట్లు జాలిగా చూసిం దామె.

"నేను అంతా విన్నాను..నీ వింత కులటవని, జారిణివని నేను కలలో కూడా తలచలేదు!"

ఆమె గుటకలు మింగుతోంది. వొణికిపొయ్యే పెదవులను, మునివేళ్ళతో తొక్కి ఉంచేందుకు ప్రయత్నిస్తోంది. హృదయాంతరాళంలో పగిలే అగ్ని పర్వతానికి అనుకూలంగా ఉండేట్లు మిగతా వాతావరణాన్ని అమర్చుతోందా అనిపిస్తోంది. ఇందాకట్నుంచీ విధి విసిరివేయగా తన మీద తాను జాలిపడుతూ దైన్యతతో ఉన్న ఆమె ముఖం, క్రమంగా మారిపోయి, ఆ విధివ్రాత మానవ ప్రేరితమేననే ధోరణిలో, విశేషించి ఎదురుగా ఉన్న తానే అందుకు బాధ్యుడైనట్లుగా చూస్తుం దెందుకు? జాజ్వల్యమానంగా కళ్ళు నిప్పు కణాలను చెరుగుతూన్నవి. ఇదంతా చిత్రంగా తోచిం దతనికి!

ఉన్మాదివలె నవ్విన ఆమె నవ్వుకు గదిలోని కాంతి సైతం వెలవెలబోయింది. ఒకవేళ తానెలాగూ తప్పు చేసిందనీ, ఇక ఇంతకన్న చేసేదేమిటనే మొండి ధైర్యంతో, తననూ యీ సమాజాన్ని కూడా గడ్డి పరకలా చూస్తూ, దేన్నీ లెక్కచేయని స్థితికి వొచ్చిందా – అనిపించిం దతనికి.

"సారథిగారూ! వొచ్చారా ... తమంతట తామే అంతా తెలుసుకున్నందుకు కృతజ్ఞురాల్ని. నాకు నోరారా చెప్పవలసిన శ్రమ తప్పించారు. మీరు చేసిన సత్కార్యం

తాలూకు ఫలితాలెంత అమోఘంగా ఉన్నవో ... చూద్దామని వొచ్చా రనుకుంటాను ...చూశారుగా!" అన్నదామె, ఖంగుమనే కంఠస్వరంతో.

ఆమె అనే మాటల అర్థ మేమిటో సారధికి వెనువెంటనే అర్థం కాలేదు. తాను ఊహించని మాటలు విని నిశ్చేతనుడయ్యాడు. అంతలో తనను తాను తెలుసుకుంటూ తానేదో పద్మను చిన్నచూపుతో చూసేందుకు పనిగట్టుకొని వచ్చినట్లు ఆమె అపోహపడుతున్నదేమో ననుకున్నాడు. కంఠస్వరంలో కూడా అధికారం ధ్వనించటం వల్ల ఆమె రెచ్చిపోయి ఉండొచ్చు.

"పద్మా!...మతిపోయిందా?" అన్నాడు సారధి.

తల ఆడిచిందామె. ముంగురులన్నీ మొహంమీద చిందర వందరగా పడినయ్.

"మతిపోక ఇంకా ఉండగలదా? మీకు తెలియటం లేదా?" అంటూ ఎదురు సవాలు చేసిందామె.

"పద్మా! కాస్త ప్రశాంతంగా ఆలోచించు..."

"శాంతా! శాంతెక్కడున్నదీ? ఆ రాత్రి - ఆ శాంతిని మీతో పాటు తీసుకొని వెళ్ళారు కదా?"

"నీవు అలానే అనుకుంటున్నావా? ఐతే ఆ శాంతిని తిరిగి తీసుకొచ్చాను - స్వీకరించు!"

"చాలా ఆలస్యమైపోయింది సారధిగారూ!... ఈ ఆలస్యంలో ఏం జరిగిందో మీరు తెలుసుకున్నారుగా!"

"పద్మా! నీవు కాలు జారకుండా పై మెట్టుమీదనే నిన్ను ఆపగలిగినందుకు ఎంత ఆనందించానో తెలుసా?" అన్నాడు సారధి, అసలు విషయాన్ని విప్పి చెప్పే ప్రయత్నంలో.

"నిజమే - సారధిగారూ! నన్ను పై మెట్టుమీదనే పడకుండా పట్టుకున్నారు. కాని, అందువల్ల మేలు జరుగుతుందని మీరు అపోహపడ్డారు. నేను జారి చివరి మెట్టుమీదికి వొచ్చి నిలిచాను. అంతకన్న ఆ పై మెట్టు మీదనే జారినట్లయితే, నేను అక్కడే కూలబడి ఉండేదాన్ని కదా - అని ఆలోచిస్తున్నాను!" ఎంతో ఉద్రేకంతో మాట్లాడటం వల్ల, వేగంగా నడిచే ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఆమె రొమ్ములు ఎగిరెగిరి పడుతూన్నవి.

సారధికి మతిపోతూన్నది. ఆమె ధోరణిని అరికట్టకుంటే, ఆమె ఇష్టానుసారంగా మాట్లాడే అవకాశాన్ని కలిగించిన వా డవుతాడు.

"పద్మా! ఆ రాత్రి నన్ను నేను కాపాడుకొని, నిన్ను కూడా రక్షించి నందుకు తప్పుపడుతున్నావా?" అన్నా డతను.

"తప్పొప్పులని కాదు..కాని ఆ ఫలితాలను చూసినట్లయితే, ఒక పెద్ద తప్పు జరిగేందుకు అవకాశం రాకుండా, చిన్న తప్పే చేసి ఉన్నట్లయితే బాగుండే దనిపించదా? ఘోరమూ, ఘోరతరమూ ఐన వాటిల్లో, ఏదో వొకటి చేసి తీరవలసినప్పుడు, ఘోరాన్ని చేయటం ఎన్నుకోతగింది కాదా?"

"అస లా తప్పు చేయకుండా ఉంటే–"

"అప్పుడు మానవులు దేవత లవరా? ఉద్రేకాలకు బానిసలై వొళ్ళు మరిచిన స్థితిలో చెడుపని చేస్తే అది చిలవలు పలవలై, ఊడలు దింపుకొని ఎలాటి విశ్వరూపానికి, వికృతరూపానికి దారితీస్తుందో ఇప్పుడన్నా తెలుసుకోండి...సరిసమాన సంస్కృతి ఉన్న మనిద్దరం కలిసి చేసే ఒక తప్పు గూర్చి, ఆ తరువాతన్నా అర్థం చేసుకో గలిగేవాళ్ళం; పశ్చాత్తాప పడేవాళ్ళం; తిరిగి అలాటిది జరగకుండా కట్టుదిట్టం చేసుకోగలిగేవాళ్ళం. ఆ మాత్రంచేత ఒకరి ఆధిక్యం, వేరొకరి అల్పత్వం రుజూ ఐన వనుకునే వాళ్ళం కాదు... ఇప్పుడేమైందీ – నే నెంత అల్పురాలినయ్యానో – మీ రిందాక అన్నట్లు – ఎంత జాణను, వ్యభిచారిణిని, కులటనయ్యానో చూడండి –" ఇక చెప్పలేక ఆమె ముఖాన్ని అరచేతుల్లో దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

సారథి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక చిన్న సమస్యను పరిష్కరించబోయి, వేరొక పెద్ద సమస్యను సృష్టించి నట్లయింది. ఇంతవరకూ జరిగిన దానికన్న, అవవలసినదాన్ని గూర్చి ఆలోచించటం మంచిది.

"పద్మా! నేను నిన్ను నీచంగా చూస్తున్నానని అనుకోకు! నేను అర్థం చేసుకున్నాను కాని, నా వలెనే ఇతరులు కూడా అపార్థం చేసుకోరని చెప్పలేను...సరే...ఇప్పుడు ఆ రహీంగాణ్ని వొదిలించేస్తే సరిపోదా?"

"ఎలా?" అన్నదామె, ముఖం పైకెతి. ఏదో ఆశారేఖ ఆమె ముఖం మీదినుంచి వేగంగా పయనించింది: "వాణ్ని సింహాసనం ఎక్కించాక వాడు దిగుతాడా? తన అధికారాన్ని ఎలా చలామణి చేస్తున్నాడో చూశారు కదా! – స్త్రీని, అబలను ... అస్వతంత్రను; ఒక్కసారి కాలు జారుతే రెండోసారి అంతకన్న కిందికి పోవాల్సిందే కాని, పైకి పాకే అవకాశం నాకెలా ఉంటుంది? ఈ సాలెగూటిలో ఇరుక్కొన్నాను; ఉక్కిరిబిక్కిరవడం మినహా, వేరొక మార్గ మేముంటుంది – సారథిగారూ!"

"అంత అధైర్యపడకు పద్మా! నేను వాడి వ్యవహారం చూస్తాను" అన్నాడు సారథి, ధైర్యం చెబుతూ.

"వొద్దు...వొద్దు...ఇప్పటికీ రహస్యం మన ముగ్గురి మధ్యే ఉన్నది. దీన్ని నలుగుర్లోకీ పోనిచ్చి రచ్చకెక్కించటం దేనికి? నేను చేసిన తప్పుకు నేనే యీ శిక్షను అనుభవిస్తాను. ఈ కుటుంబ గౌరవాన్ని కూల్చటం నాకిష్టం లేదు. నా యీ సమస్యను నేనే పరిష్కరించుకుంటాను.. మీరుమాత్రం జోక్యం కలిగించుకో వొద్దని ప్రార్థన...నన్ను ఆలోచించుకోనీండి!"

మొహాన ఉమ్మివేసినట్లయింది సారథికి. తాను చిలికిన అమృతం ఎంతగా విషపూరితమైనదో బాగా తెలిసివొచ్చింది. తన జోక్యం వొద్దని వారిస్తూంటే, తాను నిస్సహాయుడైపోయి, నిష్ప్రయోజకుడుగా మారిపోతున్నాడు.

"మరొక్కమాట–సారథిగారూ! తెలిసో, తెలియకో నేను తప్పు చేశాను. ఆ సంగతి మీకు తెలుసు. నేను నీచురాలినే అవుగాక! కులటనే అవుగాక! కాని, నా పట్ల కాస్త సానుభూతి చూపమని వేడికోలు!"

నీరైపోతున్న సారథి, "నీ కోసం ఏం చేయమన్నా చేస్తాను - పద్మా!" అన్నాడు.

"మీకు తెలిసిన యీ రహస్యాన్ని మరెవ్వరికీ - ముఖ్యంగా మీ స్నేహితుని చెవిని పడకుండా కాపాడండి - అదే పదివేలు! ఆయన తన భార్య ఇలాటిదనే మనోవేదనకు గురికాకుండా ఉండేట్లు చూసే బాధ్యత మీది!"

'ఇంత చిన్న విషయానికే వేడికోలా?' అనిపించిం దతనికి.

"పద్మా! ఎంత దైన్యతను అనుభవిస్తున్నావు!"

"ఎవరు చేసుకున్న ఖర్మను వారే అనుభవించాలిగా మరి! పోనీండి - అవమానాగ్నిలో పడి దహించుకొనిపోయి నా పవిత్రతను కాపాడుకుంటాను- ఇక మీరు వెళ్ళండి–"

ఆ చివరి మాట ఏవగింపుతో అన్నదో, అసహ్యంతో అన్నదో, సౌమ్యంగానో అన్నదో అర్థంకాలే దతనికి. వొణికిపోతూ, పిల్లివలె అడుగులు వేసుకుంటూ రోడ్డెక్కాడు.

ఆ రాత్రి ఆమెలో రగిలిన నిప్పుకణాలకు భయపడ్డాడు తను. ముందు వెనుకలు ఆలోచించకుండా ఆ అగ్ని మీదికి ఉరికి, దాని మీదనే పడినట్లయితే, అది తన శరీరంలోని కొద్ది భాగాన్ని మాత్రం కాల్చివేసేది. తను నీతిని కాపాడే సదుద్దేశ్యంతో ఆ నిప్పు జోలికి పోలేదు. ఇప్పుడది ఎంత విస్తరించి, ఎంత ప్రదేశాన్ని భస్మీభూతం చేసిందో చూస్తే నిలువునా నీరైపోతున్నాడు!

ఇప్పుడు సారథికి నిజంగానే మతిపోయింది. తన గురి తప్పడంవల్ల, కథంతా అడ్డం తిరిగి ఎంత రసాభాస ఐందో తెలిసి వొచ్చింది. విచారంతో తలక్కిందులై పొయ్యాడు... ఆ రాత్రి ఎలా ఇల్లు జేరాడో అతనికే తెలియదు.

తెల్లవారేసరికి జ్వరం వొచ్చింది.

## 4

నాలుగో రోజుకు కాస్త నెమ్మదించింది. ఆ జ్వరంలో, పద్మను గురించిన ఆలోచనల వేడి భరించరానం తయింది. తాను చేసిన తప్పు తనకు స్ఫటికమంత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు కాలచక్రం వెనక్కు మళ్ళదు కదా! పిచ్చి పిచ్చి ఆలోచనలతో సతమతమయ్యాడు.

ఐదోనాడు ఉదయం ప్రసాద్ ఇంటి దగ్గర్నుంచి మనిషొచ్చాడు.

"అయ్యగారు బొంబాయినుంచి ఇప్పుడే వొచ్చారు. మిమ్మల్ని ఉన్న పళాన తీసుకొని రమ్మన్నారు!" అన్నా డా మనిషి.

పద్మ ఉన్నదున్నట్లు చెప్పివేసిందేమోనని గుండెలు గుబగుబమన్నయ్. ఐనా, తన తప్పేమీ లేదనే ధైర్యం ఉండనే ఉన్నది. తన ప్రాణమిత్రుణ్ని చూడొచ్చుకదాననే ఉబలాటంతో వెంటనే టాక్సీలో బయలుదేరాడు.

బంగళా ముందు పోలీస్ ఆఫీస ర్లున్నారు. ఏమైందో తెలీని అయోమయ స్థితిలో లోనికి వెళ్ళాడు సారధి.

హాలులో ముసలాయన ముఖం వాడి ఉండటం కనిపించింది. వృద్ధాప్యపు బరువుతోపాటు, కొత్త బరువేదో మీదపడినట్లుగా ఆయన వాలకం కనిపిస్తోంది.

అల్లంత దూరంలో ప్రసాద్ నిర్జీవ ప్రతిమల్లే నిలబడి ఉన్నాడు. ఏమైందో తెలియక, చప్పున అతని దగ్గరికి వెళ్ళి "ప్రసాద్! ఏమైంది?" అన్నాడు సారధి, అతన్ని కదుపుతూ.

కొలకులు నిండి, ప్రవహించే కన్నీటిని ఆపలేక ప్రసాద్, "సారధీ! ఇంత దారుణం జరిగిపోతుందనుకోలేదు!" అన్నాడు.

ఆ దారుణం తాను అనుమానించింది అవునో కాదో తెలియలేదు సారధికి.

"ఏమైంది?"

"రాత్రి పద్మ ఆత్మహత్య చేసుకుంది!"

సారధి శిలాప్రతిమయ్యాడు, ఆత్మహత్య చేసుకునే సాహసం ఆమెకు ఉన్నదని తా నెన్నడూ అనుకోలేదు!

"చిత్రం – తన యీ ఆత్మహత్యకు కారణం కూడా ఆమె తెలియపరచలేదు – చూశావా! నే నామెను పువ్వుల్లో పెట్టి పూజించాను! ఏ లోపమన్నా చేశానా? నీకు తెలియదా సారధీ! ఈ ఆడవారి ప్రకృతి ఎంత సంకుచితం!" అన్నాడు ప్రసాద్.

"ఉత్తరమన్నా రాయలేదా?"

"రాసింది...తన యీ ఆత్మహత్యకు కారకు లెవ్వరూ లేరని మాత్రం ఉంది...జీవితంలో అనుభవించ శక్యం కానంత, తీరని సమస్యల్లాటివి ఏమున్నవని? అలాటి వేమైనా ఉంటే, అవి ఎంత విషమమైనవైనా, వాటిని ఎదుర్కొనేందుకు నేను సిద్ధంగా లేనని ఆమె ఎందు కనుకోవాలి? చివరకు కారణమన్నా నేను తెలుసుకోలేని స్థితిలో నన్ను పారేసి, అన్యాయం చేసింది – చూశావా?"

–ఆ కారణం ఏమిటో ఆమె రాయకపోవటమే మంచిది. ఐతే తనకా కారణం – తెలుసు! కనుకనే సారధి మాట్లాడలేకపొయ్యాడు.

కాని, పద్మ తనతోపాటే తన రహస్యాన్ని కూడా తీసుకొని పోయింది. ఇంతకు మినహా మరో మార్గమే ఆమెకు తోచలేదు. కాని ఎంత పిచ్చి పని చేసింది!

"సారధీ!...నీ వెప్పుడన్నా..ఆమె ఇలా చేస్తుందని పసిగట్టావా? అలాటి సూచనలేమైనా గ్రహించావా?" అన్నాడు ప్రసాద్.

"లే....లేదు!"

"మరేమిటిది - ఖర్మ కాకుంటే?"

ఖర్మే మరి! ఆ ఖర్మకు తానూ కారకుడే! ఆమె ఆత్మహత్యకు పరోక్షంగా తనే కారణం! అంతకన్న యీ న్యాయచట్టాలకూ, నైతిక విలువలకూ, మానవుని కట్టడులకూ అందని, దొరకని హంతకుడు తాను. తానెంత దుర్మార్గుడో సారధికి నసాళం అంటేట్లుగా తెలిసి వొస్తోంది.

"చూడు భాయీ! ఈ బంగళాకు పోలీసులు కూడా వొచ్చారు. కుటుంబ గౌరవం ఎంత దిగజారిందో!" అన్నాడు ప్రసాద్.

కాని, అసలు కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు ఆ ఇల్లాలు పద్మ చేసిన త్యాగం తనొక్కడికే తెలుసు! దాన్ని తాను గాక ఇతరు లెవ్వరూ అర్థం చేసుకోలేరు కూడాను!

"నీవేం మాట్లాడవేం సారధీ!"

సారధి మాట్లాడే స్థితిలో లేదు. ఫాలభాగమంతా చెమట్లు కమ్మింది. పత్యం తీసుకొని ఒక్క రోజే అవటంవల్ల మనిషి తూలి పడబొయ్యాడు. ప్రసాద్ అతన్ని పట్టుకొని దగ్గరున్న సోఫాలో పడుకోబెట్టి, వెంటనే డాక్టర్‌కు ఫోన్ చేసేందుకు వెళ్ళాడు.

డాక్టర్ వొచ్చి కేవలం 'షాక్' అన్నాడు. ఇంజక్షన్ ఇచ్చిన తరువాత సారధికి బాగా తెలివి వొచ్చింది. చిత్రాతి చిత్రమైన యీ ప్రపంచాన్నీ, ఇందులోని యీ వేషధారుల్నీ పిచ్చి పిచ్చిగా చూడసాగాడు సారధి!

*- జనవరి, 1958*